
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



సోమశిలలో 72.537 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 72.5 టీఎంసీలు ఉన్నాయి. 13,056 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నానదికి 2,650, ఉత్తరకాలువకు 200, కండలేరుకు 10,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,17,450
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,585
3 శాతం జీఎస్టీతో	రూ.10,902
నవర (8 గ్రా)	రూ.87,216

గరిష్టం/కనిష్టం
31.7 /26.3

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం పొడిగా ఉంటుంది. సాయంత్రం నుంచి అక్కడక్కడ చిరుజల్లులు పడే అవకాశం ఉంది. శనివారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

గంగమ్మ తిరునాళ్లకు కోర్టు అనుమతి

ఉలవపాడు: మండలంలోని బద్దిపూడిలో గంగమ్మ తిరునాళ్లకు పోలీసు శాఖ అనుమతి ఇవ్వలేదు. కొందరు టీడీపీ నాయకులు తమకు తెలియకుండా తిరునాళ్ల చేస్తున్నారని అడ్డుకోవడంతో పోలీసు శాఖ సైతం వారికే మద్దతు ఇస్తూ తిరునాళ్ల నిర్వహించవద్దని, అనుమతి లేదని తేల్చి చెప్పారు. అయితే టీడీపీ నేతల కుట్రలను వ్యతిరేకిస్తూ గ్రామస్తులు కోర్టుకెళ్లడంతో తిరునాళ్ల నిర్వహించుకోవచ్చని అనుమతిచ్చింది. శుక్రవారం రాత్రి కోర్టు ఆర్డర్ రావడంతో శనివారం నుంచి గ్రామస్తులు తిరుణాళ్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

జీఎస్టీ రాయితీలను వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జేసీ, కమిషనర్

నెల్లూరు (టౌన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఫలాలను ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల కొన్ని నిత్యావసర సరుకులు, మందుల ధరలు తగ్గుతాయన్నారు. ప్రతి ఒక్కరికి సేవింగ్స్ పెరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వల్ల చాలా రకాల వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,358 మంది స్వామి వారిని దర్శించుకోగా 29,166 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.58 కోట్లు సమర్పించారు. టైమ్‌స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వ దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

డీఎస్పీగా లింగసముద్రం వాసి



డీఎస్పీగా నియామక పత్రం అందుకున్న సుదర్శన్‌రెడ్డి తల్లిదండ్రులతో..

లింగసముద్రం: లింగసముద్రం గ్రామానికి చెందిన పాలిమేర సుదర్శన్‌రెడ్డి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో 20వ ర్యాంక్ సాధించాడు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులు మీదుగా డీఎస్పీగా నియామక పత్రం అందుకున్నాడు. సుదర్శన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

లంచమిస్తే.. వదిలేస్తాం!



రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అవినీతి ఎంవీఐ నిజాయితీ!!

- ఓవర్ లోడ్ వాహనాలకు టన్నుకో రేటు
- గ్రానైట్, ఇసుక, గ్రావెల్, యాష్, క్వార్ట్జ్ లారీలకు రైట్ రైట్
- ధాన్యం లారీలకు అయితే ఓవర్ లోడ్ గేటు
- రవాణా అధికారులకు కాసుల వర్షం
- జిల్లాలో 400కు పైగా లారీలకు నెల మామూళ్లు
- ఇవి ఇవ్వకుండా పట్టుబడితే రూ.5 వేల నుంచి రూ.15 వేలు
- అధికారులపై ఆరోపణలు వస్తున్నా.. స్పందించని ఏసీబీ, విజిలెన్స్



రవాణా శాఖలోని కొందరు అవినీతి అధికారులు నిజాయితీగా పనిచేస్తున్నారు!. 'అధిక లోడు వాహనం పట్టుకుంటే కేసులు, కోర్టులు, జరిమానాలు వంటి రిస్కులు ఉంటాయి.. అదే మాకు లంచమిస్తే ఐదు నిమిషాల్లో వదిలేస్తాం' అంటూ నిజాయితీగా పాపభీతిని చూపిస్తున్నారు. ప్రభుత్వాదాయానికి గండికొట్టి, వాహన యజమానుల కడుపులు కొట్టి, తమ జేబులు నింపుకుంటున్నారు. ఒక పక్క గ్రానైట్, ఇసుక, గ్రావెల్, యాష్, క్వార్ట్జ్ వంటి మెటల్ రవాణా చేసే అధిక టన్నేజీల లారీలకు నెలమామూళ్లు తీసుకుంటూ రైట్ రైట్ చెబుతూ.. అన్నం పెట్టే రైతులు పండించిన ధాన్యం రవాణా చేసే లారీలకు ముక్కు పిండి లంచం వసూలు చేస్తున్నారు. బహుశ వీరి అవినీతి దాష్టీకం వల్లనే కాబోలు కొనుగోలుదారులు ధాన్యం ధరలు తగ్గించడానికి కారణం అయి ఉంటుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



అధిక టన్నేజీతో నడిచే ఇసుక టిప్పర్లు

నెల్లూరు (టౌన్): ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి ఇసుక, గ్రావెల్, కంకర, క్వార్ట్జ్, నల్లమట్టి, ప్రకాశం, బాపట్ల, కరీంనగర్, వరంగల్, వైజాగ్, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి ప్రతి రోజు గ్రానైట్‌తో పదుల సంఖ్యలో వాహనాలు రవాణా చేస్తుంటాయి. ఈ వాహనాలు పరిమితికి మించి అధిక లోడుతో వెళుతుంటాయి. సాధారణంగా 6 చక్రాల లారీకి 18.5, 10 చక్రాల లారీకి 28, 12 చక్రాల లారీకి 35, 14 చక్రాల లారీకి 42, 16 చక్రాల లారీకి 47.5, 18 చక్రాల లారీకి యాక్సిల్స్‌ను బట్టి 47.5 నుంచి 55 టన్నులు, 22 చక్రాల లారీకి 55 టన్నుల వరకు లోడు తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. అయితే ఈ లారీల్లో వాహన పరిమితి కంటే అదనంగా 15 నుంచి 40 టన్నుల వరకు రవాణా చేస్తున్న పరిస్థితి ఉంది. రవాణా నిబంధనల ప్రకారం అధిక లోడుతో వెళుతున్న వాహనం పట్టుబడితే తొలుత ఓనర్ ఫెనాల్టీ రూ.20 వేలు, ఆ తర్వాత వాహన పరిమితికి మించి ప్రతి టన్నుకు రూ. 2 వేలు అపరాధ రుసుం రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక లారీలో 15 టన్నులు అదనంగా ఉంటే ఓనర్ ఫెనాల్టీ రూ.20 వేలు, 15 టన్నులకు రూ.30 వేలు కలిపి మొత్తం రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఎక్కువ సంఖ్యలో ఓవర్‌లోడు వెళ్తున్న వాహన యజమానులు రవాణా అధికారులకు నెల మామూళ్లు అందజేస్తున్న పరిస్థితి ఉంది.

నెల మామూళ్ల వసూళ్లకు ప్రత్యేక సిబ్బంది

అధిక లోడు వాహనాలకు సంబంధించి నెల మామూళ్లు వసూలు చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని రవాణా అధికారులు నియమించుకున్నారు. గతంలో రవాణాశాఖలో హోంగార్డులుగా పనిచేసిన ఇద్దరు, ఓ ఎంవీఐ దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన ఒకరు, మరొకరు రవాణా అధికారుల దగ్గర వ్యక్తిగత పనులు చక్కబెట్టే వారుగా ఉన్నట్లు చెబుతున్నారు. వీరు జిల్లాలో తిరుగుతున్న అధిక లోడు వాహనాల యజమానుల నుంచి డబ్బులు వసూలు చేసి రవాణా అధికారులకు అందజేస్తుంటారు. నెల మామూళ్లు వసూలు చేసినందుకు ఒక్కో లారీకి రూ.100 వీరికి ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో నెల మామూళ్ల గుట్ట చప్పుడు కాకుండా జోరుగా సాగుతుంది.

పొదలకూరు నుంచి చెన్నైకు నిత్యం ధాన్యం లోడుతో లారీలు వెళుతుంటాయి. శుక్రవారం రాత్రి చెన్నైకు వెళ్తున్న 4 లారీలను పొదలకూరు మండలం బిరదవోలు వద్ద రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఎంవీఐ ఆపారు. ఆ లారీల్లో వాహన పరిమితికి మించి 4 నుంచి 5 టన్నుల ఓవర్‌లోడు ఉంది. సదరు ఎంవీఐ కేసు నమోదు చేస్తే ఒక్కో లారీకి రూ.30 వేల వరకు జరిమా చెల్లించాల్సి ఉంటుందని, తనకు రూ.5 వేలిస్తే లారీలను ఇక్కడి నుంచి పంపిస్తానని చెప్పారు. ప్రస్తుతం మోటారు ఫీల్డ్ బాగాలేదని, అంత డబ్బులు ఇచ్చుకోలేమని ఎంత బతిమాలాడినా ఒప్పుకోకపోవడంతో చివరకు 3 లారీలకు రూ.15 వేలు, మరొక లారీకి రూ.3 వేలు కలిపి మొత్తం రూ.18 వేలు ఇవ్వడంతో సదరు అధికారి ఆ లారీలను అక్కడి నుంచి పంపించి వేశారు. ఇదే ఎంవీఐ గతంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలకు విత్ అవుట్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసి సస్పెండ్ అయ్యారు. ఈ రీతిలో ప్రతి రోజు జిల్లాలో ఏదొక ప్రాంతంలో ఓవర్ లోడ్‌కు నెల మామూళ్లు చెల్లించని లారీల నుంచి డబ్బులు వసూలు చేస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు.



ఇలాంటి అధిక లోడ్ వాహనాలు కనిపించవు..

ఏసీబీ, విజిలెన్స్ నిస్తేజం

జిల్లా రవాణాశాఖ అవినీతి, అక్రమాలపై ఆరోపణలు వస్తున్నా ఏసీబీ, విజిలెన్స్ శాఖలు నిస్తేజంగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా రవాణాశాఖలో ఏసీబీ తనిఖీలు లేకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. తమ అనధికార మామూళ్ల వ్యవహారం జోలికి వెళ్లకుండా ఉండేందుకు రవాణాశాఖ నుంచి నెల మామూళ్లు పోతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోనే ఆ శాఖపై ఎలాంటి తనిఖీలు ఉండడం లేదని చెబుతున్నారు.

ఓవర్‌లోడ్ వాహనాలపై రూ.3 కోట్లు వసూలు చేశాం



జిల్లాలో ఓవర్‌లోడ్‌ను ప్రోత్సహించం. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు అధిక లోడుతో వెళుతున్న 770 వాహనాలపై కేసులు నమోదు చేశాం. వాటి నుంచి రూ. 3 కోట్లు అపరాధ రుసుం వసూలు చేశాం. ఇప్పటికే జిల్లాలోని అందరూ ఎంవీఐలు, ఏఎంవీఐలకు ఓవర్‌లోడ్‌పై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఏ ఒక్క ఓవర్‌లోడ్ వాహనాన్ని వదిలి పెట్టేది లేదు. రానున్న రోజుల్లో ఓవర్‌లోడ్‌పై విస్తృత తనిఖీలు నిర్వహిస్తాం.
– బి.చందర్, ఉపరవాణా కమిషనర్

400కు పైగా లారీలకు మామూళ్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వ్యాప్తంగా 400కు పైగా లారీలకు నెల మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో 20 మందికి పైగా ఎంవీఐలు, ఏఎంవీఐలు ఉన్నారు. ఓవర్ లోడుకు 6 చక్రాల లారీకి రూ.1,000, 10 చక్రాల లారీకి రూ.1,200, 12 చక్రాల లారీకి రూ.1,300 నెలవారీ మామూళ్లు ఇస్తున్నట్లు తెలిసింది. కృష్ణపట్నం నుంచి కడప, అనంతపురం, కర్నూలు తదితర జిల్లాలో 150కు పైగా బల్కర్‌ల్లో యాష్‌ను అధిక లోడుతో తీసుకెళుతుంటారు. వీటి నుంచి జిల్లాలోని అందరి ఎంవీఐలు, ఏంవీఐలకు కలిపి ఒక్కో బల్కర్‌కు నెలకు రూ.50 వేలు ఇస్తున్నట్లు సమాచారం. ఈ రీతిలో ఒక్కో అధికారికి రూ.లక్షల రూపంలో అనధికార నెల మామూళ్లు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

తక్కువ ధరకే బంగారమంటూ..

- ఓ వ్యక్తి నుంచి రూ.14.50 లక్షల దోపిడీ
- నిందితులు ఓ అధికారి సన్నిహితులుగా గుర్తింపు
- పలువురిని అదుపులోకి తీసుకుని పోలీసుల రహస్య విచారణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: నెల్లూరు నగరంలో కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. ఓ వ్యాపారికి తక్కువ ధరకే బంగారం ఇస్తామని ఆశ చూపి ఇంటికి తీసుకెళ్లి రూ.14.50 లక్షలు దోచుకున్న ఘటన జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ పైపుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ చేస్తున్న శ్రీనివాసులు ద్వారా మరో రియల్ ఎస్టేట్ వ్యాపారి విజయభాస్కర్‌తో పరిచయం ఏర్పడింది. ఈజీగా డబ్బు సంపాదించే మార్గాలు చాలా ఉన్నాయని, తనకు తెలిసిన వారి వద్ద తక్కువ ధరకు బంగారం లభిస్తుందని విజయభాస్కర్ నమ్మబలికారు. బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు విక్రయించుకోవచ్చని చెప్పారు. విజయభాస్కర్ ఓ వ్యక్తి నంబర్ ఇచ్చి అతన్ని సంప్రదించాలని చెప్పాడు. ఈ క్రమంలో చంద్రశేఖర్ గత నెల 21న రూ.14.50 లక్షలు నగదు బ్యాగ్ తీసుకుని నెల్లూరు రూరల్ పరిధిలోని కొత్తకాలువ సెంటర్‌లో ఉన్న ఓ ఇంటికి వెళ్లాడు. ఆ వ్యక్తి తన వద్ద ఉన్న నకిలీ బంగారు బిస్కెట్లు చూపించారు. మీ డబ్బులు కూడా చూపించాలని చంద్రశేఖర్‌ను కోరగా డబ్బులు బయటకు తీశారు. డబ్బులు చూసిన వ్యక్తి అతన్ని బెదిరించి డబ్బులు లాక్కున్నారు. అక్కడి నుంచి వ్యక్తి వెళ్లిపోగా భయంతో ఆ ఇంట్లోనే ఉన్నారు. కొంతసేపటికి ఆ ముఠాలోని ఓ మహిళ అసలు ఇక్కడ ఎందుకు ఉన్నావు, ఎవరు నువ్వు అంటూ మహిళ నాటకానికి తెర తీసింది. దీంతో చంద్రశేఖర్ అక్కడి నుంచి బయటపడి నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితులు ఓ అధికారి సన్నిహితులుగా అనుమానం

తక్కువ ధరకే బంగారం పేరుతో ట్రాప్ చేసిన ముఠాలో ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి నెల్లూరులోని ఓ అధికారి సోదరుడిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని రహస్యంగా పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. వీరంతా గతంలో అనేక కేసుల్లో కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ముఠాలో ఇంకా ఎవరైనా ఉన్నారా? గతంలో జరిగిన ఇటు వంటి కేసుల్లో వీరి ప్రమేయం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

తరచూ ఘటనలు

ఈ తరహా ఘటనలు జిల్లాలో ఇటీవల కొన్ని చోటు చేసుకున్నాయి. కావలి, బిట్రగుంట ప్రాంతాల్లో ఈ తరహా ముఠా ఉన్నట్లు సమాచారం. ధనవంతులు, వ్యాపారస్తులు లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ట్రాప్ చేస్తున్నారు. తక్కువ ధరకే బంగారం ఇస్తామని ఆశ చూపి దోపిడీకి పాల్పడుతున్నారు. గతంలో కావలికి చెందిన సుధీర్ అనే వ్యక్తిని ఇదే తరహా కేసులో అరెస్ట్ చేశారు. మరో వ్యక్తిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఇటీవల జిల్లాలో ఈ తరహాలో మరో రెండు ఫిర్యాదులో వచ్చాయి. ప్రజలు కూడా ఇటువంటి ముఠా చేతులో మోసపోకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మాలకొండ ఆలయానికి రూ.12,49,537 రాబడి

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో కొలువైన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం రూ.12,49,537 రాబడి వచ్చినట్లు ఈఓ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కుంకుమార్చనకు రూ.19,480, తలనీలాలు రూ.53,075, ప్రత్యేక దర్శనం రూ.4,17,000, రూం అద్దెలు రూ.34,490, లడ్డూ ప్రసాదాలు రూ.2,85,075, అన్నదానం రూ.3,87,235 ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.12,49,537 వచ్చినట్లు చెప్పారు.

అధికారుల తీరు మారాలి

- గతంలో ప్రారంభించిన పనులు పూర్తి చేయడానికి ఏమిటి ఇబ్బందులు
- అంగన్‌వాడీ భవనాలు ఎందుకు నిర్మించడం లేదు
- ఆగిన భవన నిర్మాణాలకు పంచాయతీ, మండల పరిషత్, జెడ్పీ నిధులు
- పదేపదే ప్రోటోకాల్ ఉల్లంఘించడంపై సీరియస్
- విద్యార్థులతో పనులు చేయించడం ఏమిటి?
- సకాలంలో విజయదీపికను సిద్ధం చేయండి
- సమావేశాలకు జిల్లా అధికారులు కచ్చితంగా హాజరుకావాలి
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): 'వివిధ శాఖల అధికారుల పని తీరు మారాల్సిన అవసరం ఉంది. గతంలోనే నిధులు కేటాయించి టెండర్లు ఖరారు చేసిన ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సబబు. మంజూరు చేసిన భవన నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి చేయడంలో జాప్యం ఎందుకు జరుగుతుంది. భవనాలను పరిశీలించి మరమ్మతుల కోసం ఎస్టిమేషన్లు వేసింది మీరే కాదా? అదే పనులు చేయడానికి వీలుకాదంటున్నారు. జిల్లాలో అంగన్‌వాడీ భవనాలు ఎందుకు నిర్మించడం లేదు' అంటూ జెడ్పీ చైర్ పర్సన్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్‌లో హెల్పర్లు ఉండగా విద్యార్థులతో పనులు చేయించడం ఏమిటని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ఇకపై విద్యార్థులతో ఎక్కడైన పనులు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. 10వ తరగతి విద్యార్థులకు సంబంధించిన 'విజయ దీపిక'ను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ గెస్ట్‌హౌస్ టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంజూరు చేసిన పనుల విషయం పట్టించుకోరు, నిలిచిపోయిన పనులపై ప్రతి సమావేశంలో చర్చిస్తారు.. ఇదేక్కడి పరిస్థితి అని నిలదీశారు.

అనేక భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి

గ్రామీణ ప్రాంతాల్లో గతంలోనే నిధులు మంజూరు చేసి ప్రారంభించిన గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, బల్క్‌మిల్క్ సెంటర్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా భవనాలను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరం అయితే జెడ్పీ నుంచి నిధులు కేటాయిస్తామన్నారు. మంచినీటి సరఫరాకు సంబంధించి మోటార్లు, బోర్ల మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ సమావేశాలకు తప్పని సరిగా జిల్లా అధికారులు హాజరు కావాలన్నారు. అనుమతి లేకుండా అధికారులు హాజరుకాకపోతే ఇకపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం జెడ్పీ నిధులు అడుగుతున్నారు. నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నాం.. ప్రారంభోత్సవాలకు మాత్రం ఆహ్వానించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తరచూ ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్రం ఇస్తున్న నిధులతో గర్భిణులకు శ్రీమంతాలు, బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తప్పని సరిగా జెడ్పీటీసీ సభ్యులను ఆహ్వానించాలని సూచించారు. అంతకముందు గృహ నిర్మాణం, డీఆర్‌డీఏ, డ్వామా, పరిశ్రమలు, ఏపీ సీడ్స్, ఐటీడీఏ తదితర శాఖలతో సమీక్షించారు. స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

4 ఏళ్లు పూర్తయిన సందర్భంగా..

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీటీసీ సభ్యులు బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సభ్యులందరూ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

సచివాలయంలో వీఆర్‌ఓ మద్య సేవనం

మర్రిపాడు: మండలంలోని పడమటినాయుడుపల్లి సచివాలయంలో ఓ వీఆర్‌ఓ మద్య సేవనం చేసి అక్కడే మత్తులో జోగిన వైనం శుక్రవారం రాత్రి జరిగింది. రాత్రి 9 గంటల తర్వాత వీఆర్‌ఓ రంతుల్లా మద్యం మత్తులో ఉండడంతో గ్రామస్తులు గమనించి వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సచివాలయంలో విలువైన వస్తువులు పోతే ఎవరు జవాబు దారి అంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఈ వీఆర్‌ఓ పలు సందర్భాల్లో మద్యం తాగి కార్యాలయానికి వచ్చిన తరుణంలో ఉన్నతాధికారులు మందలించారు. తహసీల్దార్ సైతం అతనిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా అతని తీరులో మార్పు రాలేదని సమాచారం. ఈ విషయమై తహసీల్దార్‌ను సంప్రదించగా, కలెక్టర్‌కు పూర్తి నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సేవలందించే దేవాలయాలుగా ప్రజల మన్ననలు అందుకున్న సచివాలయాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో మద్యపానం కేంద్రంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



మత్తులో జోగుతున్న వీఆర్‌ఓ రంతుల్లా

పొగాకు పంట నియంత్రణ పాటించాలి

- పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

కందుకూరు: అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌లో అధిక నిల్వలు ఉన్నాయని, ఈ ఏడాది మార్కెట్‌లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని, బోర్డు పరిమితి మేరకే పంట సాగు చేయాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ సూచించారు. కందుకూరులోని 1, 2వ పొగాకు వేలం కేంద్రాల్లో శనివారం ఆయన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు పండించే దేశాల చైనా, బ్రెజిల్, జింబాంబ్వే, టాంజానియా వంటి దేశాల్లో వాతావరణం అనుకూలంగా ఉండడం వల్ల అధిక పొగాకు పండిందన్నారు. ఈ నేపథ్యంలో పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండే అవకాశం లేదన్నారు. రైతులు అధిక ధరలకు పొలాలు, బ్యార న్‌లు కౌలుకు తీసుకుని నష్టపోవద్దని సూచించారు. బోర్డు సూచించిన విస్తీర్ణంలోనే పొగాకు పంటను సాగు చేయడం వల్ల మార్కెట్ బాగుంటుందని వివరించారు. వేలం నిర్వహణాధికారులు ఎం కిరణ్, చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్కెట్‌కు అనుగుణంగా రైతులు పొగాకు సాగులో నియంత్రణ పాటించాలన్నారు. నాణ్యమైన పొగాకు పండిస్తే మంచి ధరలు వస్తాయని చెప్పారు. పొగాకులో పొటాషియం వాడకం పెంచడం వల్ల కొంత హైగ్రేడ్ పొగాకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు మండెల మీద ఎక్కువ కాలం చెడిపోకుండా ఉండే సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఓ రాజగోపాల్ బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యశ్వంత్‌కుమార్

జగజ్జననీ.. నమోస్తుతే

దేవీ శరన్నవ రాత్రి మహోత్స వాలను పురస్క రించుకొని జగ న్మాత విశేషాలం కారాల్లో కటాక్షి స్తున్నారు. జగజ్జననిని భక్తులు దర్శిం చుకొని తన్మ యత్వం చెందు తున్నారు.


- సాక్షి నెట్‌వర్క్


గజలక్ష్మిగా రాజరాజేశ్వరి అమ్మవారు


మూలస్థానేశ్వరాలయంలో రాజరాజేశ్వరిగా..


ముత్యాల చీర అలంకారంలో కన్యకాపరమేశ్వరి


త్రిపురభైరవిగా ఇరుకళల పరమేశ్వరి


రూ.20 లక్షల కరెన్సీతో ధనలక్ష్మి అలంకారం


భండాసురవధ అలంకారంలో కామాక్షితాయి

క్లుప్తంగా

కనులపండువగా శ్రీవారి కల్యాణం



రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి పొదలకూరు మండలం చాటగొట్లకు చెందిన నలగర్ల గోపాలయ్య, లక్ష్మీదేవి దంపతులు, కుమారుడు పవన్‌కుమార్ రూ 1,00,116 విరాళాన్ని అందజేశారు.

రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు



దుత్తలూరు: రోడ్డు పక్కకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లిన ఘటన దుత్తలూరులోని ఏపీ కాలనీ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బెంగళూరు నుంచి ప్రకాశం జిల్లా వైపు ఎస్సెస్పీటీ ట్రావెల్స్ బస్సు వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమై వాహనాన్ని డ్రైవర్ నిలపడంతో ప్రమాదం తప్పింది. ఘటనలో ఎవరూ గాయపడలేదు. హైవే నిర్వహణ సంస్థ క్రేన్ సాయంతో పక్కకు తీశారు.

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ఆత్మకూరు రూరల్: బైక్ అదుపుతప్పడంతో మహిళ మరణించారు. వివరాలు.. మండలంలోని అశ్వనీపురానికి చెందిన మెహతాజ్‌బేగం నెల్లూరు నుంచి స్వగ్రామానికి బస్సులో బయల్దేరారు. ఆత్మకూరు – సోమశిల రోడ్డు సెంటర్‌కు చేరుకొని తమ బంధువుల బైక్‌పై అశ్వనీపురం బయల్దేరారు. మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పడంతో ఆమె గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మరణించారు. మృతురాలి తల్లి ఆయేషాబేగం ఫిర్యాదు మేరకు ఎస్సై జిలానీబాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నెల్లూరు(పొగతోట): జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాన్ని కల్పించారు. ఎనిమిది మందికి జూనియర్ అసిస్టెంట్లుగా.. ఇద్దరికి టైపిస్టులుగా ఉద్యోగాలు కల్పించారు. ఈ క్రమంలో దీనికి సంబంధించిన ఉత్తర్వులను జెడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు శనివారం అందజేశారు. ముజీబ్, అసోసియేషన్ నేతలు లక్కాకుల పెంచలయ్య, భీమిరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

వన్నె తగ్గిన నిమ్మ

- పెరిగిన దిగుబడులు • దిగజారిన ధరలు


యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు : నవరాత్రుల సమయంలోనూ నిమ్మకాయలకు డిమాండ్ కరువైంది. మార్కెట్లో కిలో ధరలు రూ.20 నుంచి రూ.35 వరకు ప్రస్తుతం పలుకుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి ఆఖరి వరకు ఇదే పరిస్థితని వ్యాపారులు పేర్కొంటున్నారు. మరోవైపు చలికాలంలో నిమ్మ వాడకం గణనీయంగా తగ్గుతుంది. గతేడాదితో పోలిస్తే ఈ ప్రాంతంలో వర్షాలు తక్కువగా.. ఉత్తరాదిలో భారీగా కురుస్తున్నాయి. తోటల్లో కాయల దిగుబడి పెరిగినా.. ధరలు పతనమవుతుండటం రైతులకు ఇబ్బందిగా మారింది. మచ్చలు అధికంగా ఉండటంతో గిట్టుబాటు ధర లభించడం లేదు. కాయలు కోసిన అనంతరం ప్రాథమిక జాగ్రత్తలను పాటించకపోవడంతో నాణ్యత దెబ్బతింటోందని తెలుస్తోంది. తడిసిన కాయలను కోసి ఇళ్లకు తీసుకొచ్చి తొడిమెలు తొలగించడం సైతం దీనికి కారణమని తెలుస్తోంది.

ఎగుమతులు పెరిగి.. డిమాండ్ తగ్గి

పొదలకూరు, గూడూరు మార్కెట్ల నుంచే కాకుండా తెనాలి, బయటి రాష్ట్రాల నుంచి ఎగుమతులు బాగా పెరిగాయి. ఈ పరిణామంతో డిమాండ్ తగ్గిపోతోంది. దీనికి తోడు తోటల నుంచి కాయల దిగుబడి పెరిగింది. మార్కెట్లకు విపరీతంగా వస్తుండటంతో ఎగుమతులను వ్యాపారులు పెంచారు.

వద్దంటున్న ఢిల్లీ వ్యాపారులు

నిమ్మకాయల ఎగుమతులు, ధరల నిర్ణయంలో ఢిల్లీ మార్కెట్ కీలకంగా వ్యవహరిస్తోంది. అయితే వర్షాలు, చలి ప్రభావం, ఎగుమతులు పెరగడంతో కాయలను పంపొద్దంటూ వారు ఫోన్లు చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే కాయలను అన్‌లోడ్ చేసుకునేందుకు సైతం విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. వర్షాలతో మార్కెట్‌కు సకాలంలో వెళ్లలేకపోవడంతో కాయలు దెబ్బతింటున్నాయని వ్యాపారులు తెలిపారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట


హాజరైన అధికారులు

నెల్లూరు రూరల్: దేశ మహిళల ఆరోగ్య భద్రత కోసం స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రధాని మోదీ ఏర్పాటు చేశారని డీపీఎం రమేష్ పేర్కొన్నారు. నగరంలోని వైఎస్సార్‌నగర్‌లో గల పీహెచ్‌సీలో వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కేన్సర్, మధుమేహం, రక్తపోటు తదితర వ్యాధులను త్వరితగతిన గుర్తించి.. నివారించేందుకు వీలవుతుందని చెప్పారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్రాన్‌ఖాన్, నెల్లూరు అర్బన్ సీడీపీఓ అరుణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధిని మెరుగుపర్చాలి

- డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి


మాట్లాడుతున్న నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు మహిళలకు జీవనోపాధులను మెరుగుపర్చేలా చర్యలు చేపట్టాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి ఆదేశించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఏపీఎంలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వయం సహాయక మహిళలకు ఏటా వందల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తున్నామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 47,890 యూనిట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పాడి పశువులు, గొర్రెలు, మేకల కొనుగోళ్లు, బీమా, టీకాలు తదితర అంశాలపై గ్రామీణ ప్రాంతాల మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ రమేష్ నాయక్ మాట్లాడారు. జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపడతామని వివరించారు.

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆత్మకూరు రూరల్: ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్సై జిలానీ బాషా కథనం మేరకు.. పట్టణ పరిధిలోని నరసాపురానికి చెందిన మాలకొండయ్య.. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థలో రూ.ఆరు లక్షల రుణాన్ని నాలుగేళ్ల క్రితం తీసుకున్నారు. ఇటీవలి కాలంలో ఈఎంఐలను మూడు నెలలు సక్రమంగా చెల్లించలేదు. ఈ క్రమంలో ఇంటికి తాళమేసేందుకు కంపెనీ ప్రతినిధులు యత్నించారు. దీంతో మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ తరుణంలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి సీఐ గంగాధర్, ఎస్సై జిలానీ తమ సిబ్బందితో కలిసి చేరుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు




బ్రాయిలర్	రూ.118
లేయర్	రూ.110
బ్రాయిలర్ చికెన్	రూ.214
స్కిన్‌లెస్ చికెన్	రూ.236
లేయర్ చికెన్	రూ.187

ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైమ్): ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. వివరాలు.. బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న జ్ఞానశేఖర్ ఇంట్లో ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విషయాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలానికి వారు చేరుకొని మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఇంట్లోని సీలింగ్‌కు ఉన్న పీవీసీ కాలిపోయింది. ఘటనలో రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. కాగా అపార్ట్‌మెంట్ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ హెచ్చుతగ్గులు రావడంతో సమీపంలోని రెండిళ్లలో టీవీలు కాలిపోయాయి.

నిమ్మ ధరలు



పెద్దవి	రూ.35
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10